అమ్మో, మళ్లీ పులి !

పుల్లేరు గుడ్డివలస ప్రాంతంలో పాదముద్రలు

సాలూరు: మండలంలోని నెలిపర్తి పంచాయతీ పుల్లేరు గుడ్డివలస ప్రాంతంలో పెద్ద పులి పాదముద్రలు కనిపించడంతో అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంత ప్రజలను ఆదివారం అప్రమత్తం చేశారు. ఈ గ్రామం సమీపంలో పులి పాదముద్రలను అటవీ సిబ్బంది నిర్ధారించారు. గతంలో సంచరించిన గుమడాం, మారయ్యపాడు ప్రాంతంలో పులి రెండు ఆవులను చంపేసింది. దీంతో అటవీశాఖ సిబ్బంది ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. దీనిపై అటవీ రేంజ్ అధికారి కె.రామారావు మాట్లాడుతూ గతంలో సంచరించిన ప్రాంతంలో మళ్లీ పులి సంచరించే అవకాశం ఉందని, పాదముద్రలు కనిపించడంతో ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పారు.

అడ్డుపడుతున్న పెద్దమనిషి ఎవరు?

- రెండున్నర ఏళ్లు దాటినా కదలని వైనం
- చైర్‌పర్సన్ ఆశావహుల్లో ఆందోళన
- అగ్రనేతల మధ్య ఆధిపత్య పోరు
- నివురుగప్పిన నిప్పులా రాజుకుంటున్న అసమ్మతి

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లాలో పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం రెండు కీలక మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్ల మార్పు జరగాల్సి ఉంది. రెండున్నరేళ్ల తర్వాత చైర్‌పర్సన్‌ను మార్చి వైస్ చైర్మన్‌గా నాయకులకు ఆ పీఠంపై కూర్చోబెడతామని పార్టీ అగ్రనేతలే అప్పట్లో మాటిచ్చారు. సరిగ్గా రెండు న్నరేళ్ల క్రితం వైసిపి తరపున చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఇద్దరు మహిళా నాయకులు పోటీ పడడంతో జిల్లా నాయకత్వం ఒకరికి చైర్‌పర్సన్ పదవి ఇచ్చి ఇంకొకరికి వైస్ చైర్మన్ పదవి ఇచ్చి సంతృప్తి పరిచారు. రెండున్నరేళ్ల తర్వాత చైర్‌పర్సన్‌ను దించి వైస్ చైర్మన్‌ను ఆస్థానంలో కూర్చోబెడతామని వైసిపి అగ్రనాయకులు ఒప్పందం కుదిర్చారు. అయితే ఈ అగ్రనేత మధ్య ఆధిపత్య పోరు కారణంగా ఆ పెద్దమనుషుల ఒప్పందం అమలు చేయాల్సిన సమయం దాటిపోయింది.

సాలూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ స్థానంలో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న జర్జాపు దీప్తిని రెండున్నరేళ్ల తర్వాత కూర్చోబెడతామని ఉమ్మడి జిల్లా అగ్రనేతలు హామీ ఇచ్చారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు చైర్‌పర్సన్ పీఠం ఆశించిన జర్జాపు దీప్తి రెండున్నర ఏళ్ళ పాటు వైస్ చైర్‌పర్సన్ పదవిని స్వీకరించడానికి అంగీకరించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ సిఎం రాజన్నదొరల సమక్షంలోనే ఆ ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం అమలు చేయాల్సిన గడువు సెప్టెంబర్‌తో ముగిసింది. అయినా పార్టీ జిల్లా నాయకత్వం ఎన్నికలు దగ్గరలో ఉన్నాయన్న సాకుతో ఒప్పందం అమలుకు వెనుకాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ భర్త నాగేశ్వరరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఆమె పురపాలనపై ఏకాగ్రత పెట్టలేని పరిస్థితిలో ఉన్నారు. పట్టణంలో అధికారి పార్టీ ఎదుగు బొదుగూ లేని పరిస్థితుల్లో ఉంది. ఇలాంటి పరిస్థితిలో మున్సిపాలిటీ నాయకత్వం మార్చాల్సిన అవసరం కనిపిస్తున్నా జిల్లా నాయకత్వం జాప్యం చేయడం వెనుక సామాజిక కోణం దాగి ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాను శాసిస్తున్న అగ్రనేత ఒకరు పెద్దమనుషుల ఒప్పందం అమలుకు మోకాలడ్డుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఇక పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ విషయంలోనూ మార్పు చేయాల్సిన అవసరం ఉన్నా జిల్లా నాయకత్వం దాటవేత ధోరణి అవలంభిస్తోంది. గతంలో చైర్‌పర్సన్ ఎన్నిక సమయంలో బోను గౌరీశ్వరి, మంత్రి ఉమామహేశ్వరి పోటీ పడగా, వీరి మధ్య ఒప్పందం కుదిర్చినట్లు తెలుస్తోంది. ఐదేళ్లలో చెరి సగం కాలం పాటు చైర్‌పర్సన్ పీఠంలో కూర్చునేందుకు పెద్దలు రాజీ ఫార్ములా కుదిర్చారు. అయితే ఇక్కడ కూడా ఆ ఫార్ములా అమలుకు అగ్రనేత అడ్డుపడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. మన్యం జిల్లాలో కీలకమైన రెండు మున్సిపాలిటీ పీఠాలకు సంబంధించిన చైర్‌పర్సన్ల మార్పు వ్యవహారం జాప్యం జరుగుతున్న కారణంగా పార్టీలో అసమ్మతి నివురు కప్పిన నిప్పులా రాజుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాల్లో కీలకమైన మున్సిపాలిటీల ఫిఫ్టీ ఫిఫ్టీ ఒప్పందం అమలుకు నోచుకోక పోతే రానున్న ఎన్నికల్లో దాని ప్రభావం కనిపించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇటీవల కాలంలో పెద్ద మనుషుల ఒప్పందానికి లోబడి కొన్ని జిల్లాల్లో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, చైర్మన్ల మార్పు జరిగింది. స్థానిక జిల్లాల అగ్రనేతలే ఆ ఒప్పందాలను అమలు చేశారు. అక్కడ అమలైన ఒప్పందం మన్యం జిల్లాలో ఎందుకు అమలు కావడం లేదనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. అధికారపార్టీకి చెందిన ఇద్దరు అగ్రనేతల మధ్య ఆధిపత్య పోరు కారణం గానే మున్సిపాలిటీల ఫిఫ్టీ ఫిఫ్టీ ఒప్పందం అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యేలపై ఇప్పటికే వున్న ప్రజావ్యతిరేకతకి తాజా పరిణామాలు కూడా తోడయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఏనుగులు ధ్వంసం చేసిన గంటిచేనును పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, బాధిత గిరిజనులు

ఏనుగులను తరలించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కురుపాం

ఏనుగుల వల్ల ధ్వంసమైన పంటలకు, ఇళ్లకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి జిల్లాలో రెండు ఏనుగుల గుంపులను జూకు తరలించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని తిత్తిరి పంచాయతీలో గల తిత్తిరి, మర్రిమానుగూడ తదితర గిరి శిఖర గ్రామాల్లో ఏనుగుల వల్ల పంటలు, ఇళ్లు నష్టపోయిన బాధిత గిరిజన రైతులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా దాదాపు తిత్తిరి పంచాయితీ పరిధిలోగల 200 ఎకరాలకు పైగా గంటిచేను, రాగులు, వరి పంటలను ధ్వంసం చేశాయని, అలాగే నాలుగు పూరి, రేకు ఇళ్లను కూడా పూర్తిగా ధ్వంసం చేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా కనీసం అధికారులు ఇప్పటికీ గ్రామానికి వచ్చి బాధితుల పేర్లు నమోదు చేసి వారికి నష్టపరిహారం గురించి మాట్లాడకపోవడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా పంట నష్టాలను గుర్తించి ఎకరాకు రూ.25 వేలు చొప్పున పరిహారం అందించి ఇంతకుముందు పంట నష్టపోయిన కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి తదితర మండలాల్లో రైతులకు బకాయి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 11 మంది వరకు ఏనుగుల దాడిలో చనిపోయినా వీటి తరలింపునకు ప్రత్యామ్నాయ చర్యలకు పాలకులు, అటవీ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. జియ్యమ్మ వలస, భామిని, సీతంపేట, తదితర గిరిజన ప్రాంతాల్లో ఏనుగులు రోడ్లు పైకి వచ్చి వాహనాలు, మనుషులు, పశువుల పై పడి దాడి చేస్తూ ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం చేస్తున్నా యని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి జిల్లాలో నష్టపోయిన పంటలను అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని ఇప్పటికే గ్రామాల్లో సంతకాల సేకరణ, ఆందోళన కార్యక్రమం చేపట్టామన్నారు. తక్షణమే అధికారులు స్పందించక పోతే డిఎఫ్ఒ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, గిరిజన గ్రామల రైతులు హిమరక తాబు, రామలక్ష్మణ్, తిరుపతిరావు, రాము, రోజా, జయంతి, జుమ్మా, బిడ్డకి జోషి పాల్గొన్నారు.

కురుపాంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

సైకిల్ సంగ్రామ యాత్రలో ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాం ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో వందలాది మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ ఉన్నత చదువుల నిమిత్తం మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర బృందం ఖండించింది. ఎస్ఎఫ్ఐ చేపడుతున్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ఆదివారం ఏడో రోజు కురుపాం మండలానికి చేరుకుంది. మొదటగా యాత్రను గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు జె.సరోజా, ఎం. మీనాక్షి, టి.శోభారాణి, ఎస్.వసంతరాణి తదితరులు స్థానిక గౌడవీధి దగ్గర స్వాగతం పలికి, సంఘీభావం తెలిపారు. కురుపాం మండల ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎం.అన్నాజీ అధ్యక్షతన మండలంలో గల స్థానిక వసతిగృహాలను, విద్యాసంస్థలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసేలా తమ విధానాలను అనుసరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యార్థుల భవిష్యత్తుకు మేలు చేసేలా అనేక రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్న జగనన్న ప్రభుత్వం మెరుగైన విద్యను అందించడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. కళాశాలలో నాన్ టీచింగ్ లెక్చరర్లను నియమించాలని, సంక్షేమ హాస్టలకు ప్రహరీ గోడలు నిర్మించాలని, మరుగుదొడ్లు, మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లలేక చదువులు మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి కనిపిస్తుందన్నారు. కావున, ప్రభుత్వ వెంటనే స్పందించి మెరుగైన విద్యాభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కురుపాం మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకై ఎస్ఎఫ్ఐ చేపడుతున్న పోరాట కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంక్షేమ హాస్టల్‌కు బకాయిలుగా నిలిచిన మెస్ (డైట్) బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, డిగ్రీలో తీసుకొచ్చిన హానర్స్ - మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలని, ఎన్ఇపి, 117 జిఒ రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, హాస్టళ్లలో పర్మినెంట్ వర్కర్లను, వార్డెన్లను నియమించాలని, పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, హాస్టళ్లలో ఎఎన్ఎంలను నియమించాలని లేని డిమాండ్ చేశారు. లేకుంటే సంగ్రామ యాత్ర అనంతరం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాజు, హెచ్.సింహాచలం, బి. గంగారావు, కె. భాస్కరరావు మరియు యాత్రలో ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, ఉమాశంకర్, సిసింద్రీ, అన్నాజీ, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్

పోయాం... మోసం..

విద్యుత్తు సిబ్బంది మోసానికి గురైన దళిత రైతు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో విద్యుత్తు శాఖ అధికారులు చేస్తున్న లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కేవలం రైతులను మోసగించి డబ్బులు గుంజుకుంటున్న వైనం ఒక్కొక్కటి వెలుగులోకి వస్తుంది. వీరి మోసాలకు గిరిజన, దళిత రైతులు బలవుతున్నారు. తాము మోసపోయామన్న విషయం ఎవరికీ చెప్పకోలేని నిస్సహాయ స్థితి వారిది. విద్యుత్ శాఖ సిబ్బంది మాయమాటల్లోపడి కష్టపడిన సొమ్మంతా వారి చేతుల్లో పెడుతున్నప్పటికీ వారి పొలాలకు మాత్రం విద్యుత్ లైన్లు అందడం లేదు. వివరాల్లోనికి వెళ్తే...

మండలంలోని సిబిల్లి పెద్దవలస గ్రామానికి చెందిన దళిత రైతు వెలగాడ రాము గత ఏడాది సెప్టెంబర్‌లో తన పొలానికి విద్యుత్ లైన్ మంజూరు చేయాలని విద్యుత్ శాఖ అధికారులు చుట్టూ పలుమార్లు ప్రదక్షిణ చేశాడు. అయితే స్థానిక ఉద్యోగికి ఈ విషయమై తెలపగా, తనపై అధికారితో మాట్లాడి పనిచేస్తామని చెప్పాడు. ఇందుకోసం స్థానిక పెద్దల సమక్షంలో సుమారు రూ.60 వేలు కూడా చెల్లించాడు. పొలంలోనికి మూడు స్తంభాలను పెద్దవలస గ్రామం నుంచి తన సొంత ఖర్చులతో తీసుకువెళ్లానని తెలిపారు. ఏడాది కావస్తున్నప్పటికీ ఇంతవరకూ తనకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని రాము ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. విద్యుత్ శాఖ అధికారులను అడిగితే తన పేరున ఎలాంటి పిఆర్ లేదని అంటున్నారని వాపోయాడు. దీంతో తాను మోసపోయానని లబోదిబో మంటున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తన పొలానికి విద్యుత్తు లైను ఇప్పించాలని కోరుతున్నాడు.

తన పొలానికి తీసుకొచ్చిన విద్యుత్తు స్తంభాలను చూపుతున్న రైతు

అంతా మేమే చూసుకుంటాం.. నీకు ముగ్గేసి ఇచ్చేస్తాం..!

రైతులను ఇబ్బంది పెట్టకుండా, ఒక్క అడుగు బయటకు పెట్టకుండా అంతా తామే చేస్తున్నామని... నీకు కూడా అలాగే చేసి విద్యుత్ కనెక్షన్ వేసిన చోట ముగ్గేస్కోవచ్చని ఓ ఉద్యోగి నమ్మబలకడంతో నిరుపేద రైతు మోసపోవాల్సి వచ్చింది. ఒక విద్యుత్ కనెక్షన్ మంజూరు కావాలంటే జియాలజీ సర్టిఫికెట్‌తో పాటు ఫారం-3 ఇతర ధ్రువపత్రాలు నిబంధన ప్రకారం జమ చేయాల్సి ఉంటుంది. దీన్ని కూడా ఉన్నతాధికారులు పరిశీలించి విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసే ఆస్కారం ఉంది. అయితే అవినీతికి అలవాటు పడ్డ కొంతమంది ఉద్యోగులు రైతులను మోసగిస్తూ ఇలాంటి చిల్లర పనులకు యత్నిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

నడుకూరులో వర్షం లేక ఎండిపోతున్న వరిచేను

కరుణ చూపని వరుణుడు

ఎండుతున్న పంటలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గత వారం రోజులుగా వర్షాలు ఎండగట్టడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నారు. పొట్టదశకు వచ్చిన సమయంలో చినుకు చుక్క కానరాకలేదు. దీంతో వరి పొలాల్లో ఎండిపోతున్నాయి. చినుకు చుక్కకోసం అన్నదాత ఆకాశవైపు ఆశగా ఎదురు చూస్తున్నాడు.

మండలంలోని నడుకూరు, పివిఆర్ పురం, గడగమ్మ గ్రామాలకు తోటపల్లి రిజర్వాయర్ ద్వారా సాగునీరు సరఫరా కాకపోవడంతో అన్నదాతలు మోటర్లతో నీరు తోడి పంటలను కాపాడుకుంటున్నారు. గత వారం రోజుల నుంచి వరుణుడు కరుణించకపోవడంతో వర్షంపైనే ఆధారపడిన పంటలు ఎండలకు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి పంటపై పెట్టుబడులు పెట్టి సాగు చేసినప్పటికీ కళ్లముందే పంట నాశనం కావడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. తోటపల్లి రిజర్వాయర్ మొదటి ఛానల్ నుండి శివారు ప్రాంతమైన గడగమ్మ గ్రామానికి ఇప్పటి వరకు కూడా చుక్క నీరు రాలేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జులై 20న సాగునీరు విడిచి పెట్టినప్పుడు శివారు ప్రాంతాల వరకు సాగునీరందిస్తామని నీటిపారుదల శాఖ అధికారులు హామీలు ఇచ్చిప్పటికీ నేటికి మూడు నెలలు కావస్తున్నా గడగమ్మ గ్రామానికి చుక్క నీరు కూడా రాలేదని వాపోతున్నారు. దీంతో వీరంతా మోటర్లపైన ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఆ అవకాశం లేని వారు వరుణదేవునిపై ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పివిఆర్ పురానికి కూడా కాలువల ద్వారా సాగునీరు రాకపోవడంతో ఆ గ్రామ అన్నదాతలు మోటర్లపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఏది ఏమైనా అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తామని పాలకులు ప్రకటనకే పరిమితమవుతున్నారు తప్ప కనీసం రైతులపై శ్రద్ధ చూపకపోవడంతో అన్నదాతలు విమర్శలు గుప్పిస్తున్నారు. వరుణదేవుని రాక కోసం ప్రతిరోజూ ఆకాశం వైపు అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

'అభినందన నందన మందారాలు' ఆవిష్కరణ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పట్టణానికి చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు, పంచాంగకర్త టిఎల్ఎన్ మూర్తి సంకలనపర్చిన అభినందన నందన మందారాలు అనే పుస్తకాన్ని పార్వతీపురం పట్టణానికి చెందిన జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ భట్లు ప్రముఖ కవి, రచయిత, వాగ్గేయకారుడు గంటేడ గౌర్నాయుడుతో కలిసి ఆదివారం పట్టణంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాహితీ అభిమానులు, కవులు, రచయితలు, రచయిత కృషి గురించి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని ఎవరి పదవీ విరమణ జరిగిన అభినందన పత్రాన్ని తనదైన శైలిలో పద్యాలతో రాయడం మూర్తి విశిష్ట శైలి అని అన్నారు. ఆయన రాసిన అభినందన మందారాలు 100కు పైగా సంకలనపర్చి ఒకే పుస్తకంగా రావడం భావి రచయితలకు ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని కొనియాడారు. అనంతరం టిఎల్ఎన్ మూర్తి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన రచయితలు, సాహితీ అభిమానులు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

మూర్తి దంపతులను సన్మానిస్తున్న సాహితీవేత్తలు

పిచ్చికుక్క దాడిలో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పిచ్చికుక్క దాడి చేయడంతో ఆరుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. జియమ్మవలస మండలం తురకనాయుడువలసలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి గ్రామానికి చెందిన గుణుపూరు గోవిందనాయుడు, మరడ శంకరరావు, తామాడ శ్రీనివాసరావు, వాకాడ స్వామినాయుడు, బీమారాపు శ్రీనివాసరావు, పళ్ల సత్యంను గాయపరిచింది. ముఖం, ఒంటిపై స్వల్ప గాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన వారిని వైద్యం కోసం రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యం అందించారు.

పిచ్చికుక్క దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కెమిస్ట్రీ గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ గెస్ట్ అధ్యాపకులుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీవరం తెలిపారు. అభ్యర్థులు పీజీలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. సెట్, నెట్, పిహెచ్‌డి పొందిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులు జెరాక్స్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 11న నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె కోరారు. అభ్యర్థులు విధిగా తరగతి గదిలో విద్యార్థులకు డెమో బోధించాల్సి ఉంటుందని అన్నారు.

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ ఆఫీస్ బేరర్లు

దసరా సెలవుల్లో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ వద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ (రెండవ విడత) దసరా సెలవుల్లో వద్దని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు సర్వశిక్ష అభియాన్ అధికారులను డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయ సమస్యలపై ఈనెల 10న డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు. పట్టణంలోని వేదాంత కళాశాలలో యుటిఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక శిక్షణలు పని దినాల్లో ఇచ్చి విద్యాబోధనను హరించి వేస్తున్నారని అన్నారు. దసరా పండుగ రాష్ట్ర పండుగ్గా ఉందని, ఈ పండుగను అందరూ జరుపుకుంటారని కావున ఎట్టి పరిస్థితుల్లో దసరా సెలవుల్లో శిక్షణను అంగీకరించమని అన్నారు. సర్వశిక్ష అభియాన్ అధికారులు తేదీలను మార్చనిచో శిక్షణను బహిష్కరించాలని ఉపాధ్యాయులను జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం పిలుపునిచ్చింది. దసరా సెలవుల్లో ట్రైనింగ్ ఇవ్వకూడదని, ఉపాధ్యాయులు, కేజీబీవీ టీచర్లు, సిఆర్‌పిలు, సర్వ శిక్ష అభియాన్ సిబ్బంది జీతాలు వెంటనే చెల్లించాలని, పాఠశాలల గ్రాంట్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 10న సాయంకాలం 5 గంటలకు స్థానిక డిఇఒ కార్యాలయ వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని, ఇందులో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న మన్యప్రగతి చైర్మన్ రవికుమార్

గిరిజన గ్రామాల్లో గ్రామదర్శిని

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో చాకలి గూడ, పెదవంగర, పెద వంగర గూడ, ఖడగండి, చిన వంగర, గోలుకుప్ప గుడ, గోలుకుప్ప, రోలు గుడ్డి, సారంగి, మొఖరి నాయుడు గూడ, కోడి పిల్ల గూడ తదితర గిరిజన గ్రామాల్లో ఆదివారం మన్య ప్రగతి ఆధ్వర్యంలో గ్రామదర్శిని నిర్వహించారు. మన్య ప్రగతి చైర్మన్ గేదెల రవికుమార్ ప్రజా సమస్యలు, సంస్కృతి - సంప్రదాయాలు, గ్రామాల అభివృద్ధి, మానవ సంబంధాలపై 'గ్రామ దర్శిని - ప్రజా చైతన్య అవగాహనా కార్యక్రమం'. నిర్వహించారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది - మహాత్మా గాంధీ స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలన్నారు. గ్రామ పెద్దలు, మహిళాలు, యువతతో గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు, నిరుద్యోగం, జీవో నెంబర్ 3, బోయ వాల్మీకిను ఎస్టీ జాబితాలో చేర్చడం గూర్చి చర్చించారు. గిరిజన సమస్యలను పరిష్కరించడానికి అధికారుల వద్దకు తీసుకొని వెళ్లి సమస్యను పరిష్కారం దిశగా కృషి చేస్తానని అన్నారు

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మన్మథరావు

రోడ్డు పనులకు సర్పంచ్ శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలో పలు గిరిజన గ్రామాలకు రూ.40 లక్షలతో మంజూరైన రహదారి నిర్మాణ పనులకు ఆదివారం సర్పంచ్ ఎ.మన్మధరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుంబేమానుగూడ నుండి కాగు మానుగూడ వరకు 2 కిలోమీటర్లు రూ.పది లక్షలు, మాలగాడిగూడ నుండి తోటపాయిగూడ వరకు రెండు కిలోమీటర్లు రూ.పది లక్షలు, సికరికూడ నుండి సాలిడంగూడ వరకు కిలోమీటరుకు రూ.పది లక్షలు, సాలిడంగూడ నుండి సందిగూడ వరకు రెండు కిలోమీటర్లు రూ.పదిలక్షల చొప్పున నిధులను ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి విడుదల చేశారన్నారు. దీంతో గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం కలగనుందన్నారు. ఐటిడిఎ ద్వారా నిధులు మంజూరు చేయించి రహదారి సౌకర్యం కల్పించినందుకు గిరిజన గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

జోగింపేటలో ఇకెవైసి నమోదును పరిశీలిస్తున్న ఎఒ అవినాష్

ముమ్మరంగా ఇకెవైసి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రైతులకు ఇకెవైసి నమోదు చేశారు. ఈ మేరకు మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.అవినాష్ బుడ్డిపేట, జోగింపేటలో ఇకెవైసి నమోదును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఇకెవైసి చేసుకోవాలన్నారు. ఖరీఫ్ ధాన్యం అమ్మేటప్పుడు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఇకెవైసి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'జగదీశ్వరిని ఎమ్మెల్యేగా గెలిపిస్తాం'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం, వంగర, నెల్లిగండ్రకోన గ్రామాల్లో సాధికార సేవా మిత్రలకు టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అధ్యక్షతన ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 46 మంది సాధికార సేవా మిత్రాలతో పాటు బూత్ ఇన్చార్జి, యూనిట్ ఇన్‌ఛార్జి, క్లస్టర్ ఇంచార్జ్ శిక్షణలో పాల్గొన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి జగదీశ్వరిని అత్యధిక మెజారిటీతో గెలిపించి, చంద్రబాబు నాయుడును మళ్లీ ముఖ్యమంత్రి చేయడానికి మేము అంతా కలిసికట్టుగా పార్టీకి సేవ చేస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జ్ బిడ్డిక, క్లస్టర్ ఇంచార్జ్ వెంకటరావు, పోల్‌మేనేజ్‌మెంట్ పోలారు శ్రీనివాసరావు హాజరయ్యారు.

కూరగాయల టెండర్లు వాయిదా

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన గురుకులాలు, మినీ గురుకులాలు, కళాశాలలు, వసతిగృహాలకు కూరగాయలు, పండ్లు, చికెన్ సరఫరా చేసేందుకు ఈనెల 9న అనగా సోమవారం నిర్వహించాల్సిన టెండర్ల కార్యక్రమం ఈనెల 12కు వాయిదా వేసినట్టు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న మధ్యాహ్నం 3గంటలకు టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. కావున ఈ విషయాన్ని టెండరుదార్లు గమనించాలని కోరారు.

పార్వతీపురంలో షార్ట్ ఫిల్మ్ సందడి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

బాలికకు సూచనలు ఇస్తున్న దర్శకుడు

పట్టణ పరిసర ప్రాంతాలలో ఆదివారం షార్ట్ ఫిలిం షూటింగ్‌లతో సందడి వాతావరణం నెలకొంది. విశాఖకు చెందిన షార్ట్ ఫిలిం డైరెక్టర్ గంగాధర్ నేతృత్వంలో పాపే మా ప్రాణం అనే లఘు చిత్రాన్ని బాలగోడబతో పాటు పట్టణంలోని పలుచోట్ల స్థానిక నటులతో ఈ చిత్ర నిర్మాణం జరుగుతుంది. కొత్తవలస వద్ద ఎవిడి డిగ్రీ కాలేజీ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్లో షార్ట్ ఫిలిం షూటింగ్ జరుపుతామని, ఇందులో బాలగోడబ బుజ్జి, బెలగాం శేఖర్, అనిల్, రవి తదితరులు నటించారు.

ఈ రోడ్డు బాగుపడేదెప్పుడో..?

ప్రజాశక్తి - సాలూరురూరల్

సాలూరు నుండి మక్కువ రోడ్లో ప్రయాణించాలంటే నరకంతో సమానం. ప్రతిరోజూ ఈ రోడ్లో ఏదో ఒక వాహనం గొయ్యిల్లో ఇరుక్కుపోవడం నిత్యకృత్యంగా మారింది. ఈ రోడ్డు మంజూరై మూడేళ్లయినా, ఇప్పటి వరకూ ఈ రోడ్డులో కనీసం గుంతలు కూడా పూడ్చలేదు. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రాణాలతో చెలగాటమేనని, అందులో భారీ వాహనాలైన లారీలు, బస్సులు తిరగాలంటే ప్రజలు భయపడిపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డు విషయంలో ప్రభుత్వం పట్టించుకోకపోతే ఈ రోడ్డుపై ప్రయాణం విరమించుకోవడమేనని పెదపదం మాజీ సర్పంచ్ మత్స భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే ఈ రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

గోతులమయమైన సాలూరు-మక్కువ రోడ్డు

మూతపడ్డ వైటిసి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ కోసం ఏర్పాటు చేసిన యూత్ ట్రైనింగ్ సెంటర్లు మూడేళ్లుగా మూతపడ్డాయి. దీంతో ఒకవైపు ప్రభుత్వ లక్ష్యం నీరుకారగా, మరోవైపు యువతకు ఉపాధి శిక్షణ కరువైంది. ఇందులో పనిచేస్తున్న సిబ్బందికి నెలలు తరబడి వేతనాలందక ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన వైటిసి కేంద్రాలు ఉపాధి శిక్షణ లేక వెలవెలబోతున్నాయి. గత టిడిపి ప్రభుత్వ హయాంలో గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురం, సీతంపేటలో గిరిజన నిరుద్యోగ యువతకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో వైటిసిలను ఏర్పాటు చేశారు. వైటిసిల నిర్వహణ, అందులో పని చేస్తున్న ఉద్యోగుల జీతాల కోసం ట్రైకార్ నిధులను వినియోగించేవారు. 2017 నుంచి 2019 వరకు ఎంతోమంది నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు కంప్యూటర్, టైలరింగ్, డ్రెస్ మేకింగ్, డ్రైవింగ్ తదితర విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేవారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు రోజుకు రూ.160 చొప్పున సమకూర్చేవారు. రెండు నెలల కాలం శిక్షణ ఉండేది. శిక్షణ నిర్వాహణలకు రూ.10వేలు చొప్పున వేతనం చెల్లించేవారు. శిక్షణ కోసం కంప్యూటర్లు, కుట్టు మిషన్లు సమకూర్చారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు యువత హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లి స్థిరపడ్డారు.

గిరిజన యువత కరువైన ఉపాధి తప్పని వలసలు

ఉపాధి శిక్షణ ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వం వైటిసిలను తిరిగి ప్రారంభించే గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధిలో శిక్షణ ఇవ్వాలి. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో వందలాదిమంది గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఉన్నారు. శిక్షణ పొందడం ద్వారా వీరికి ఉపాధికి అవకాశం ఉంటుంది.

- తోయక హరిబాబు
గిరిజన నిరుద్యోగి

వలసలు వెళ్లిపోతున్నారు

వైటిసిలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో శిక్షణ కరువైంది. గిరిజన ప్రాంతంలో యువత ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్న పరిస్థితి. గిరిజన యువతకు ప్రభుత్వం నుంచి భరోసా కరువైంది.

- కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

మూడేళ్లగా మూత

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది పాటు వైటిసిల నిర్వహణ సక్రమంగా సాగింది. అయితే కరోనా మహమ్మారి రావడంతో శిక్షణ నిలిపివేశారు. కోవిడ్ తగ్గుముఖం పట్టినా శిక్షణా కేంద్రం తిరిగి ప్రారంభించలేదు. మూడేళ్లుగా ఉపాధి శిక్షణ లేక నిరుద్యోగ గిరిజన యువత నిరాశలో ఉన్నారు. పార్వతీపురం వైటిసిలో ఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేశారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు వైటిసిల్లో గిరిజన గర్భిణీల వసతి గృహాన్ని ఏర్పాటుచేసి సేవలందిస్తున్నారు. అయితే గిరిజన యువతకు ఉపాధి శిక్షణ లేకపోవడంతో వలసలు వెళ్లిపోతున్న పరిస్థితి.

గుమ్మలక్ష్మీపురంలో యూత్ ట్రైనింగ్ సెంటర్

నిధులు కేటాయించాలి...

వైటిసిల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించి ఉపాధి శిక్షణ అందించాలి. నిధుల్లేక ఉపాధి శిక్షణ మరుగున పడింది. పదో తరగతి, ఇంటర్ చదువుకున్న ఉపాధి అవకాశాలు లేవు. ప్రభుత్వం స్పందించాలి.

- పాడి సుదర్శన్ రావు
టిడిపి మండల కన్వీనర్

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

సర్పంచి ఆర్.చైతన్య స్రవంతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తన పంచాయతీలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తూ, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు ఎల్విన్‌పేట సర్పంచి రామసామంతుల చైతన్య స్రవంతి తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడారు. మొదటిసారిగా సర్పంచ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో తాగునీరు, సిసి రోడ్లు, వీధి కాలువల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు, వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా అర్హులైన గిరిజనులందరికీ పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎల్విన్‌పేటలో రూ.80 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నెలలో రెండుసార్లు ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం, విద్య ప్రాధాన్యత విద్యార్థులకు వివరించడం వంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో పర్యటిస్తూ కొత్త కొత్త వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వడం, మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. పంచాయతీలో పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి యువత, మహిళలచే మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధి దిశగా ఆలోచించాలి

ప్రజాశక్తి - భామిని

స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీతో కూడిన రుణాలతో అవసరమైన వ్యాపార యూనిట్ ఏర్పాటుపై దృష్టి సారించి ఆర్థికాభివృద్ధి దిశగా ఆలోచన చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ తెలిపారు. సంకల్ప్ సప్తహ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎపిఎం దొడ్ల భవానీ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో సమృద్ధి దివాస్ మనోహరమైన జీవన వసరాలు పేరుతొ మహిళల ఆర్థిక అభివృద్ధి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిజివిబి పార్వతీపురం అడ్వాన్స్ మేనేజర్ సోమేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంకులు వివిధ రకాల యూనిట్ల ఏర్పాటుకు అందిస్తున్న రుణాలు, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం, సెక్యూరిటీతో కూడిన ఇన్సూరెన్స్ స్కీమైన పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై, ప్రాధాన్యత వున్న యూనిట్ ఏర్పాటు గురించి తెలిపారు. జిసిసి డిఎం సంధ్యారాణి జిసిసి కార్పొరేషన్ ద్వారా గిరిజన ఉత్పత్తులు కొనుగోలు, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఎపిజివిబి బ్యాంకు మేనేజర్ సతీష్, ఇండస్ట్రియల్ ఎడి కిరణ్ కుమార్, ఎంపిడిఒ చంద్రరావు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిజివిబి మేనేజర్ సోమేశ్వరరావు

తాగునీరందించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని మండలంలోని గదబవలస పంచాయతీ పరిధి దువ్వానపాడు గ్రామ గిరిజనులు అధికారులను కోరుతున్నారు. గ్రామంలో ఒకే ఒక బోరు ఉన్నందున వాటి ద్వారా అరకొరగా నీరు రావడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వండవ కొండపైన నిర్మించిన ఉపరితల రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రారంభించి ముచ్చటగా మూడు రోజులు తాగునీరు సరఫరా అయ్యిందని, దాదాపు మూడేళ్లయినా ఉపరితల పథకం ద్వారా తాగునీరు సరఫరాకు బ్రేకులు పడ్డాయని గిరిజనులు చెబుతున్నారు. మండలంలోని ఎలీషాపురం, పెద్దూరు, గాదిలంక గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసిన విధంగానే తమ గ్రామానికి సోలార్ రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయాలని గిరిజనులు అధికారులను కోరుతున్నారు.

నేడు నీలానగరంలో జెఎఎస్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నీలానగరంలో ఈనెల 9న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

న(క)ష్టాన్ని కొని తెచ్చుకున్నాడు..

కలుపు మందును రసాయనంతో కలిపి పంటపై పిచికారి.. జీవం కోల్పోయిన వరి

ప్రజాశక్తి - మక్కువ

ఆరుగాలం శ్రమించిన అధిక దిగుబడి సాధించి లాభపడుదామనుకున్న ఆ రైతు నష్టాన్ని కోరి కొని తెచ్చుకున్న విధంగా తయారైన ఘటన మండలంలోని చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మార్కొండపుట్టి పంచాయతీ పెదగయిసాల గ్రామానికి చెందిన రైతు వెంపటాపు తిరుపతిరావు యామరపాటుతో తన మూడు ఎకరాల వరి చేనుకు కలుపు మందును పిచికారీ చేశాడు. అనుకున్న మోతాదు కంటే అధికంగా 24శాతం క్లాస్మోడియం సాల్ట్‌ను వినియోగించి వేరొక రసాయనంతో కలిపి పంటపొలంపై పిచికారీ చేశాడు. అయితే ఒక రోజు పోయిన తర్వాత చూసిన రైతు పచ్చగా కనిపించిన పొలమంతా పసుపు రంగులో మారి ఎండిపోవడంతో లబోదిబోమన్నాడు. ఈ విషయం ఊరంతా తెలియడంతో వరి చేనును చూసిన రైతులంతా నిర్ఘాంత పోయారు. స్థానిక వ్యవసాయాధికారికి సమాచారం ఇవ్వగా పంటపై యూరియా పిచికారీ చేయాలని సలహా ఇచ్చారు. అయితే వరి చేను ఏమాత్రం కూడా రికవరీ కాలేదు. చేసిన శ్రమ కాక మదుపు కోసం పెట్టిన రూ.లక్షా50వేలు నష్టపోవాల్సి వచ్చిందని కుటుంబీకులు బోరును వినిపిస్తున్నారు. పంటలపై మందులు పిచికారీ చేసేటప్పుడు సంబంధిత అధికారుల సలహా తీసుకోకపోవడం నష్టాల్ని రైతులు చవిచూడాల్సి వస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు 'ప్రజాశక్తి' కి తెలిపారు. ఇలా నష్టపోయిన రైతుకు ఏ విధమైన నష్టపరిహారం కూడా అందించలేమని ఆయన అన్నారు

పసుపురంగుగా మారిపోయిన వరి పంట

చంద్రబాబుకు అండగా నిలవాలి

ఇంటింటి ప్రచారంలో ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా జియమ్మవలస మండలం బొమ్మికలో టిడిపి నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుపై వివరించారు. చంద్రబాబు నాయుడుకు ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. 2024 ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, మండల తెలుగు రైతు అధ్యక్షులు బైరిపూడి సత్యంనాయుడు, గుమ్మలక్ష్మీపురం మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని జోగినాయుడుగూడ గ్రామంలో ఆదివారం బాబుతో నేను సైతం కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి వెళ్లి చంద్రబాబునాయుడును అన్యాయంగా, అక్రమంగా అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించిన విధానాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. బాబు ఈ రాష్ట్రానికి, యువత కోసం చేసిన మేలును తెలియజేస్తూ పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, యూనిట్ ఇన్‌ఛార్జి బిడ్డిక స్వామినాయుడు, మండంగి కుమార్, సవర సోడంగి, గ్రామపెద్దలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జులు, పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : చంద్రబాబు పై పెట్టిన అక్రమ కేసులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారి లో నిరసన శిబిరాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబును జైలు పాలు చేయాలని ఉద్దేశంతో ఉన్నారన్నారు. ఆయనపై ఉన్న కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాజీ ద్వారపురెడ్డి శ్రీదేవి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహన్‌రావు, జి.రవికుమార్, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, గర్భాపు ఉదయభాను, బార్నాల సీతారాం, కౌన్సిలర్లు టి.వెంకట్రావు, కె.నారాయణరావు, బి.గౌరినాయుడు, కోలా సరితా మధు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బొమ్మికలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

వైసిపి పట్టణ అధ్యక్షులుగా మన్మథరావు

ప్రజాశక్తి - పాలకొండ

వైసిపి పట్టణ అధ్యక్షులుగా వెలమల మన్మధరావును మరోసారి అధిష్టానం ఎంపిక చేసింది. ఈయనకు మూడోసారి ఈ పదవి వరించగా ఆయన వర్గీయులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈయన ప్రస్తుతం పార్టీ తరపున నగరపంచాయితీలో ఐదవ వార్డు కౌన్సిలర్‌గా చురుకుగా వ్యవహరిస్తున్నారు. గతంలో కూడా ఈయన రెండుసార్లు మేజర్ పంచాయతీలో ఉప సర్పంచ్‌గా పని చేశారు. పట్టణ సమస్యలతో పాటు భౌగోళిక పరిస్థితులపై ఈయనకు అపారమైన అనుభవం ఉందని, ఈ పదవి ఆయనకు రావడం వల్ల పార్టీకి బలం అవుతుందని పార్టీలో చర్చించుకుంటున్నారు.

గిరిజన విద్యార్థులకు ఆరోగ్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గిరిజన వసతి గహాల విద్యార్థులకు మెరుగైన వైద్య పరీక్షలు ఆరోగ్య సేవలు అందించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్లా సురేష్, వెంకటరమణ, ప్రదీప్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బందిల్లేనందున విద్యార్థుల మరణాల సంఖ్య పెరుగుతుందన్నారు. విద్యార్థులు అనేక రకాలైన అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థులు చదవగలరని కావున ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి వసతి గృహానికి స్వయంగా విద్యార్థుల దగ్గరకు వెళ్లి పరిశీలించి సంబంధించిత అధికారులు, వైద్య సిబ్బంది మెరుగైన ఆరోగ్య సేవలు పూర్తి స్థాయిలో అందించాలని కోరారు.

సీతాఫలాలకు భలే గిరాకీ !

సీజన్‌లో ఏజెన్సీ పొడుగునా అమ్మకాలు
వారపుసంతలు, రోడ్ల వెంబడి విరివిగా దుకాణాలు
గిరిజన రైతులకు అదనపు ఆదాయాన్నిచ్చే ఫలాలు

ప్రజాశక్తి - కురుపాం

రుచి, నాణ్యతలో మిన్నగా ఉండే మన్యంలోని సీతాఫలాలకు మంచి గిరాకీ ఉంది. ఏటా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సీజనల్‌గా సీతాఫలాలు లభిస్తాయి. కురుపాం, గుమ్మలక్ష్మీపురం వారపుసంతల్లో కావిడీలు, బుట్టలతో గిరిజన రైతులు వీటిని విక్రయానికి తెస్తుంటారు. కావిడి సీతాఫలాలకు రూ.800 నుంచి రూ.1200 వరకు ధర పలుకుతుంది.

విశాఖ, కొత్తవలస తదితర మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు తరలివచ్చి భారీస్థాయిలో సీతాఫలాలను కొనుగోలు చేసి తరలిస్తుంటారు. మైదాన ప్రాంతంలో వీటికి మంచి డిమాండ్ ఉండడంతో కురుపాం ఏజెన్సీలోని సీతాఫలాలను కొనేందుకు వ్యాపారులు ఎగబడి వస్తుండడం విశేషం. చిన్నవారి నుంచి పెద్దవారి వరకు అందరూ అమిత ఇష్టంగా తినే సీజనల్ సీతాఫలంలో పోషకాలు మెండుగా ఉండడంతో పాటు గుండెపోటు, మధుమేహం, రక్తహీనత, ఆస్థమా వంటి పలు అనారోగ్య సమస్యలకు చక్కటి ఔషధిగా గుర్తింపు ఉండడంతో వీటికి భలే డిమాండ్ ఉంటుందనే చెప్పాలి. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారికి అందుబాటులో ఉండేందుకు వీలుగా స్థానిక గిరిజన రైతులు రోడ్ల వెంబడి బుట్టలతో ఉంచి అమ్మకాలు సాగిస్తుంటారు. అటుగా వచ్చిన వారంతా సీతాఫలాల దుకాణాల వద్ద ఆగి ఎన్నో కొన్ని కొనకుండా వెళ్లారంటే అతిశయోక్తి కాదు. గిరిజన గ్రామాల్లో జంక్షన్ తదితర ప్రాంతాల్లో సీజన్లో రోడ్డు వెంబడి ఇరువైపులా సీతాఫలాల దుకాణాల దర్శనమివ్వడం ఇక్కడ పరిపాటి. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలల్లో దురుబిలి, గుణదతీలేసు, వాడపుట్టి, గొందిలోవ, కోటకొండ, ఈతమానుగూడా, ఆగంగూడా, తిత్తిరి పులిపుట్టి, కీడవాయి, గోరడ చాపరాయి బిన్నడి, గుల్లంక తదితర గ్రామాల్లోని గిరిజన రైతులు సీతాఫలాల తోటలు పెంపకానికి మొగ్గు చూపుతున్నారు. సాంప్రదాయ పంటలకు వచ్చే ఆదాయంతో పోలిస్తే, కనీసస్థాయి పెట్టుబడి, యాజమాన్య పద్ధతులతో పండించే సీతాఫలాల సాగుతో గిరిజన రైతులకు రూ.50వేల నుంచి రూ. లక్ష వరకు అదనపు ఆదాయాన్ని సమకూర్చు కోవడం ద్వారా వారికి ఆర్థిక ఆసరాగా సీతాఫలాలు ఉంటున్నాయి.

సంతకు తీసుకొస్తున్న సీతాఫలాలు

8 కేజీల గంజాయి పట్టివేత

శృంగవరపుకోట: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తుల నుండి 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్. ఐ. తారకేశ్వరరావు ఆదివారం తెలిపారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారంతో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో స్పెషల్ ఎంఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిబ్బంది, ఎస్.కోట పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన దాడిలో మధ్యప్రదేశ్‌కు చెందిన విక్కీ, రాదే శ్యామ్ అను ఇద్దరు వ్యక్తుల నుంచి 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండకు తరలిస్తున్నామని ఎస్ ఐ తెలిపారు.

నేరాలు ఘోరాలు

మృతి చెందిన మురళి

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొమరాడ

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అంటివలసలో ఆదివారం చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంటివలసకు చెందిన ఎం.మురళి పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆత్మ హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మురళి కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

పురుగుల మందు తాగి మరణించిన మెల్లిక మురళి కుటుంబాన్ని ఐటిడిఎ అధికారులు అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం మురళి కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు పరామర్శించారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ మురళి తండ్రి మరణించడంతో ఇంటికి పెద్ద దిక్కువగా ఉన్నాడన్నారు. ఆయనపై మృతితో కుటుంబం రోడ్డున పడిందని, కావున ఐటిడిఎ అధికారులు స్పందించిన ఆదుకోవాలని కోరారు.